ప్రజాశక్తి
ఆదివారం 19 ఫిబ్రవరి 2023
8 పేజీలు




విశాఖపట్నం   అనకాపల్లి

24 ఎకరాలు... రూ.175 కోట్లు!



- వీఎంఆర్‌డిఎ అతి అంచనాలు.. అధిక ధర నిర్ణయమే కారణమా?
- 'బల్క్ ల్యాండ్' వేలంపై సందిగ్ధం
- చిన్న చిన్న ముక్కలు చేసి అమ్మకంపై తాజాగా దృష్టి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం మెట్రో పొలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డిఎ) పరిధి విశాఖ జిల్లాలోని 24 ఎకరాల బల్క్ ల్యాండ్‌పై తాజాగా సంబంధిత అధికారులు సందిగ్ధంలో పడ్డారు. పలు ప్రదేశాల్లోని ఈ భూములపై చదరపు గజం రూ.40వేల వరకూ వేలం ధర నిర్ణయించి తాజాగా వీఎంఆర్‌డిఎ నాలుక కరుచుకుంది. ఒకే సారి అంత డబ్బు పెట్టి ఎకరాలకు ఎకరాలు కొనేవారు కరువైనట్లు ఆ అధికారుల పరిశీలనలో తేలింది. పైగా విశాఖ రాజధాని ప్రకటనకే పరిమితమైందన్న వాదనలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచీ వినవస్తోంది. నిజంగా వైజాగ్‌కు పాలనా రాజధాని తరలివస్తే బయ్యర్లకు కొదవుండదని విశాఖకు చెందిన పలువురు రియల్ ఎస్టేట్ మదుపరులు తాజాగా చెప్పారు.

వేలం వేసినా స్పందన శూన్యం...

గడిచిన కొద్ది నెలలుగా దఫదఫాలుగా ఈ 24 ఎకరాల బల్క్ ల్యాండ్‌కు వేలం వేసి ఇలాగే వీఎంఆర్‌డిఎ భంగపడింది. తాజాగా ఒకేసారి ఎకరాల చొప్పున కాకుండా వీటిని చిన్న చిన్న బిట్‌లుగా మార్చి విక్రయానికి పెట్టాలని నిర్ణయించింది. నెలరోజుల్లో ఈ ప్రక్రియ అంటే 24 ఎకరాలను అమ్మేయాలనే దిశగా పావులు కదుపుతోంది. అనుకున్నది అనుకున్నట్లుగా సాగితే రూ.175 కోట్లు ఆదాయం వీఎంఆర్‌డిఎకు రావాల్సి ఉంది. బ్లాక్‌లో కాకుండా వైట్‌లోనే డబ్బులు చెల్లించాల్సి రావడంతో ఎకరాకి రూ.కోట్లలోనే వేలం ధర ప్రస్తుతం ఉన్నందున కొనుగోలు చేసేవారు దూరం జరిగిపోయారని తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ చీఫ్ సెక్రటరీ కార్యాలయ అధికారులు ఈ భూముల అమ్మకాన్ని త్వరితగతిన చేపట్టాలన్న ఆదేశాలు జారీచేసింది. పలు దఫాలు వేలానికి ఈ భూములపై వుడా ముందుకెళ్లినా ఏ ఒక్క గడువు తేదీకి పైన తెలిపిన 24 ఎకరాల బల్క్ ల్యాండ్‌కు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం విశేషం.

ఎక్కడెక్కడ ఈ భూములున్నాయి?

విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో ఈ భూములున్నాయి. అనకాపల్లి, మధురవాడ, భీమునిపట్నం, కాపులుప్పాడలో పై 24 ఎకరాలూ వీఎంఆర్‌డిఎ ఆక్షన్‌కు పెట్టింది. ఎకరాలకు ఎకరాలు కొనేవారు నుంచి స్పందన లేకపోవడంతో తన విధానాన్ని చిన్న చిన్న బిట్‌లు చేయడం ద్వారా ముందుకెళ్తోంది. ఒక్కో చోట ఒక్కోలాగ మార్కెట్ ధరలను మించిపోయి ఈ భూముల ధరలున్నాయి. గజం రూ.40వేల వరకూ పలుకుతోంది. ఒకటి రెండు చోట్ల రూ.8వేలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



దీక్షలో కూర్చున్న ఆవాజ్ కమిటీ సభ్యులకు మద్దతు తెలిపిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ దేశానికి నష్టం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మందికిపైగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడం వల్ల ఉపాధిలేమితో పాటు, దేశానికి తీవ్ర నష్టం కలుగుతుందని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 688వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో విశాఖ జిల్లా ఆవాజ్ కమిటీ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు. శిబిరాన్ని రమాప్రభ సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల దేశానికి, రాష్ట్రానికి, స్థానిక సంస్థలకు గణనీయంగా ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్లు అమలు జరిగి అన్ని తరగతుల వారికి ఉపాధి లభిస్తుందన్నారు. గత 50 ఏళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో చక్కగా నడుస్తూ, లాభాలను సాధించిందన్నారు. కార్మికుల శ్రమతో కర్మాగారం విస్తరించబడిందని తెలిపారు. నష్టాలు వస్తున్నాయని చెప్పి ఈ కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేయడం భావ్యం కాదన్నారు. దీనికి అవసరమైన సొంత గనులను సమకూర్చాలని, బొగ్గు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, బ్యాంకుల నుంచి ఆర్థిక తోడ్పాటు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర మిగతా 2లో..

ప్రజాస్వామ్య వ్యవస్థలపై ధన ప్రలోభం

▶ వార్త 4లో..

అనకాపల్లి డిఎస్‌పి సునీల్‌పై వేటు?

▶ వార్త 5లో..

ప్రభుత్వ తీరుపై టిడిపి నిరసనలు

▶ వార్త 6లో..

కొరాపుట్ రైల్వే లైన్‌లో డిఆర్ఎం తనిఖీ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం-కొరాపుట్ సెక్షన్‌ను వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి శనివారం తనిఖీ చేశారు. వివిధ స్టేషన్లలో ఏర్పాటుచేసిన సౌకర్యాలు, ఆ విభాగంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. కేటరింగ్ యూనిట్లు, వెయిటింగ్ హాళ్లు, ఇతర సౌకర్యాలను కూడా పరిశీలించారు. శివలింగపురం, అరకు, సుక్కు, కొరాపుట్ స్టేషన్లలోని రైల్వే కార్యాలయాలు, ముఖ్యమైన స్టేషన్లలో భద్రతా అంశాలనూ పరిశీలించారు. ఈ మార్గంలో తరుచు రైళ్ల పట్టాలు తప్పడానికి గల కారణాలను అధ్యయనం చేసేందుకు అధికారులతో కలిసి సుక్కు-కొరాపుట్ మధ్య పట్టాలు తప్పిన సిట్‌ను కూడా పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్లాట్‌ఫారమ్, స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించి ప్రయాణికులతో సంభాషించారు సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట ఎడిఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో-ఆర్డినేషన్) పికె మహారాణా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్ కుమార్, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ ఎస్‌కె పాత్ర అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



విశాఖపట్నం-కొరాపుట్ సెక్షన్‌లో తనిఖీ చేస్తున్న డిఆర్ఎం అనూప్ సత్పతి

డాక్‌యార్డు బ్రిడ్జి మరమ్మతులు పూర్తయ్యే వరకు..

ఎస్‌బిసి వంతెనపై రాకపోకలకు అనుమతించాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : గాజువాక, శ్రీహరిపురం, మల్కాపురం, సింధియా, డాక్‌యార్డు మీదుగా కాన్వెంట్ జంక్షన్‌కు వెళ్ళే మార్గంలో గల డాక్‌యార్డు చిన్నబ్రిడ్జిని మరమ్మత్తులు కోసం 15నెలలు మూసివేస్తున్నట్లు విశాఖ పోర్టు ట్రస్టు ప్రకటించిందని, అంతవరకు ఆ పక్కనే ఉన్న ఎస్‌బిసి బ్రిడ్జి మీదుగా వాహనాల రాకపోకలకు అనుమతించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్‌చేశారు. మద్దిలపాలెంలోని సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డాక్‌యార్డు, షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్, ఐఒసి, కోరమండల్, ఎపిసిఎల్, ఎస్సార్, ఆర్‌సిఎల్ పరిశ్రమలతో పాటు పోర్టు ఆధారిత గొడౌన్లల్లో వేలాదిమంది ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ వంతెనను మూసివేయడంతో షిఫ్ట్ డ్యూటీలు చేసే కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతారని పేర్కొన్నారు. పై చెప్పిన పరిశ్రమల్లో ఎక్కడ ప్రమాదం జరిగినా డాక్‌యార్డు ఈ వంతెన మీదుగానే నగరంలో ప్రధాన ఆసుపత్రులకు తరలిస్తున్నారని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 2లక్షల మంది ప్రజలు ఎమర్జన్సీ వైద్యానికి నగరంలోని ఆసుపత్రులే పెద్దదిక్కుగా ఉన్నాయన్నారు. ప్రత్యామ్నాయంగా ఉన్న రహదారిలో రైల్వే క్రాసింగ్‌లు, రైల్వే వ్యాగన్లతో తరచూ పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోతున్న స్థితిలో ఎస్‌బిసి బ్రిడ్జిపై ప్రజా వాహనాలు అనుమతించకపోతే పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగే అవకాశముందని తెలిపారు. పజల ప్రాణాల రక్షణ, కోట్లాది రూపాయలు ఇంధనం, ప్రజలు, కార్మికుల సమయం, అదనపు భారాన్ని తప్పకుండా పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, మేయరు, కార్పొరేటర్లు తక్షణమే స్పందించి కేంద్ర ప్రభుత్వం, తూర్పునావికాదళ అధికారులతో సంప్రదింపులు జరపాలని కోరారు. పటేల్ (పార్లర్ బ్రిడ్జి) మరమ్మత్తులు పూర్తయ్యేవరకు ఎస్‌బిసి బ్రిడ్జి మీదుగా ప్రజల వాహనరాకపోకలు అనుమతించేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ, ప్రయివేట్ రంగ సంస్థల యూనియన్లు, ప్రజాసంఘాలు, ప్రజలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా మిగతా 2లో..



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

'ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలి'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : తొట్లకొండలో బౌద్దేతర గుడి నిర్మాణ ఘటనను పక్కదారి పట్టించిన ఆర్కియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వెంకటరావును సస్పెండ్ చేయాలని బుద్దిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ కమిటీ, ఇతర సంఘాలు డిమాండ్ చేశాయి. అంబేద్కర్ భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బుద్దిష్ట మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి వెంకటరమణ, కో కన్వీనర్ ఎం.మల్లయ్య రాజు మాట్లాడారు. చారిత్రక బౌద్ధ క్షేత్రం తొట్లకొండలో బౌద్దేతర గుడి నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని తెలిపారు. దీనిపై బౌద్ధ, దళిత సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ గుడిని తొలగించారు. కానీ అలాంటి నిర్మాణం ఏమీ జరగలేదంటూ ఆర్కియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వెంకటరావు అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. తొట్ల కొండపై భౌద్దేతర గుడి నిర్మించారనే ఆధారం ఉన్నప్పటికీ వాటిని మాయం చేసే ప్రయత్నానికి ఆయనే కారణమని ఆరోపించారు. అయినప్పటికీ ఆధారాలు చూపించగలమని చెప్పారు. అక్కడ వాచ్ మ్యాన్‌గా పనిచేస్తున్న చిన్నారావు ఈ గుడిని నిర్మించాడని, సంఘాలు అభ్యంతరం తెలియజేయడంతో అతన్ని విధుల నుంచి తొలగించారని తెలిపారు. కానీ అతనిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. చారిత్రక బౌద్ధ క్షేత్రాలలో భౌద్దేతర గుడిని నిర్మించడం మాన్యుమెంట్స్ చట్టానికి వ్యతిరేకమన్నారు. ఈ గుడి నిర్మాణం బుధవారం సాయంత్రం వెలుగులోకి వచ్చిందని గురువారం పరిశీలనకు వెళ్లామని తెలిపారు. ముందు రావద్దంటూ అడ్డుకున్నారని, చివరకు అనుమతితో అక్కడికి వెళ్లేసరికి గుడిని తొలగించారని చెప్పారు. ఈకార్యక్రమంలో బుద్దిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు కర్రి సత్యనారాయణ, ఉమామహేశ్వరి, భీమ్ సేన వార్ ప్రతినిధి పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

'వైసిపి పాలనలో దళితులు, మైనారిటీలపై దాడులు'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జగన్మోహన్‌రెడ్డి పాలనలో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.నజీర్ ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళిత నాయకుడు, మాజీ మంత్రి జవహర్‌ను పోలీస్ స్టేషన్‌లో కింద కూర్చోబెట్టి పోలీసులు అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. అనపర్తిలో టిడిపి అధినేత చంద్రబాబును అక్రమంగా అడ్డుకున్నారని ప్రశ్నిస్తే మాజీ మంత్రి జవహర్, ఇతర దళిత నేతలతో అమర్యాదగా ప్రవర్తించి పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో దళితులు, మైనారిటీ తరగతులపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలో దళితులు, మైనారిటీలు ప్రభుత్వ వైఖరి గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

మొదటి పేజీ తరువాయి..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ దేశానికి నష్టం

అభివృద్ధికి దోహదపడుతున్న స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడటానికి తాను కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా ఆవాజ్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ ఆయుబ్, కార్యదర్శి అబ్దుల్ అసరఫ్, జహరా ఆరా, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యులు అబిదా, అబ్దుల్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిసి వంతెనపై రాకపోకలకు అనుమతించాలి

సమావేశంలో సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సభ్యులు, మద్దిలపాలెం, మల్కాపురం జోన్ కార్యదర్శులు వి.కృష్ణారావు, పి.పైడిరాజు పాల్గొన్నారు.

ఐసిసి ఈవెంట్లకు అధికారిక భాగస్వామిగా పాలీక్యాబ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) మ్యాచ్‌లకు భారతదేశంలో సుప్రసిద్ధ విద్యుత్ ఉత్పత్తుల కంపెనీ పాలీక్యాబ్ ఇండియా లిమిటెడ్ (పిఐఎల్) అధికారిక భాగస్వామిగా వ్యవహరించనుందని పాలీక్యాబ్ సంస్థ ప్రెసిడెంట్ నీలేష్ మలానీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసిసి పురుషుల, మహిళల అంతర్జాతీయ ఈవెంట్లకు పాలీక్యాబ్ స్పాన్సర్‌గా వ్యవహరించనుందని పేర్కొన్నారు. 2023 సంవత్సరాంతం వరకూ ఈ ఒప్పందం కొనసాగుతుందని, దీనిలో భాగంగా దక్షిణాఫ్రికాలో జరుగనున్న ఐసిసి ఉమెన్స్ టీ 20 వరల్డ్ కప్, యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరుగనున్న ఐసిసి వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్, ఇండియాలో జరుగనున్న ఐసిసి మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ 2023 ఉంటాయని తెలిపారు.

'జన్మభూమి'కి ఆధునిక ఎల్‌హెచ్‌బి రేక్ కోచ్‌లు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి, ఆధునిక లింకే హాఫ్మాన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) రేక్‌ను విశాఖపట్నం-లింగంపల్లి మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్ అందించనుంది. 12805 విశాఖపట్నం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23 నుంచి, 12806 లింగంపల్లి-విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24 నుంచి అమలులోకి వచ్చేలా ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో నడుస్తాయి. దీంతో విశాఖపట్నం నుంచి బయలుదేరే 20 జతల రైళ్లను ఎల్‌హెచ్‌బిగా మార్చడం జరిగింది.

కురుపాం మార్కెట్‌లో నిత్యాన్నదాన పథకం

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : దేవదాయ ధర్మాదాయ శాఖ సేవా కార్యక్రమాల్లో భాగంగా కురుపాం మార్కెట్‌లో ప్రతిరోజూ మధ్యాహ్నం వంద మందికి అన్నదానం చేసే నిత్యాన్నదాన పథకాన్ని ఆ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష మహాశివరాత్రి సందర్భంగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మానవసేవే మాధవ సేవగా తలచి దేవదాయ శాఖ ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కురుపాం మార్కెట్ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ అన్నదాన పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుపాం మార్కెట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శేఖరబాబు, శ్రీ కనకమాలక్ష్మి అమ్మవారి దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పునీత్ సాగర్ అభియాన్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : 'పునీత్ సాగర్ అభియాన్'లో భాగంగా ఫిబ్రవరి 2023కి సంబంధించిన కోస్టల్ క్లీనప్ కార్యకలాపాలు యారాడ, భీమిలి, ఆర్‌కె.బీచ్‌లు, మేఘాద్రిపేట రివర్ ఛానల్, హోప్ ఐలాండ్ కాకినాడలో శనివారం చేపట్టారు. తూర్పు నావికా దళానికి చెందిన 550 మందికి పైగా సర్వీస్, డిఎస్సీ సిబ్బంది, స్థానికులు తీర ప్రాంతాల క్లీనప్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ప్లాస్టిక్ సీసాలు, రేపర్లు, థర్మాకోల్, గాజు ముక్కలు సహా 410 కిలోల నాన్-బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను సేకరించారు.

నగర సుందరీకరణ పనులు పూర్తికి ఆదేశం

ప్రజాశక్తి-విశాఖపట్నం : నగర సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ అనంత శంకర్‌తో కలిసి జోడుగుళ్లపాలెం నుంచి రాడిసన్ హోటల్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జి - 20 సదస్సుకు దేశ విదేశాల నుంచి దాదాపు 200 మంది అతిథులు వస్తున్నారని వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు సుందరీకరణ పనులు, అటవీశాఖకు సంబంధించిన స్థలాలలోని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన ప్రాంతాలలో బీచ్ అభివృద్ధి పనులు సందర్శకులకు ఇబ్బంది కలగకుండా పూర్తిచేయాలన్నారు.

అంతిమ సంస్కారానికి అగచాట్లు!

- శివశక్తినగర్ శ్మశానవాటికలో సమస్యల తిష్ట
- అవస్థలు పడుతున్న మృతుల కుటుంబీకులు
- పట్టించుకోని జివిఎంసి యంత్రాంగం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదోవార్డు శివశక్తినగర్ రోడ్ (బొట్టవానిపాలెం) శ్మశానవాటికలో సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. జనావాసాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడడం అనేక ప్రాంతాల్లో మామూలే అయినప్పటికీ, అంతిమ సంస్కారాలకైనా శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం దారుణమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

జివిఎంసి 5, 7 వార్డుల పరిధిలోని మధురవాడ మార్కెట్ నుంచి టైలర్స్ కాలనీ, ప్రియదర్శిని కాలనీ, శ్యామ్ నగర్, ధోబి కాలనీ, డాక్‌యార్డ్ కాలనీ, శ్రీనివాసనగర్, స్వతంత్రనగర్, గణేష్ నగర్, బొట్టవానిపాలెం, సర్వేనెంబర్ 27లోని కొమ్మాది జంక్షన్, అయ్యప్పనగర్, వివేకానంద నగర్, ముత్యాలమ్మకాలనీ, గాంధీనగర్, సద్గురు సాయినాథ్ కాలనీ, శివశక్తినగర్, వైఎస్ఆర్ నగర్ ఇలా పలు కాలనీ వాసులకు శివశక్తినగర్‌లోని ఏకైక శ్మశానవాటికి దిక్కుగాఉంది. ఆయా కాలనీల్లో ఎవరు మృతి చెందినా, అంతిమ సంస్కారాలకు శివశక్తినగర్‌లోని శ్మశానవాటికకు తీసుకురావాల్సిందే.

ఇలా పలు కాలనీలకు ఆధారంగా ఉన్న శివశక్తినగర్‌లోని శ్మశానవాటికలో అన్నీ సమస్యలే. జివిఎంసి అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ శ్మశానవాటికలో కాలుపెట్టలేని దుస్థితి. మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించాలంటే ప్రజలు నానా అగచాట్లు పడాల్సిందే. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, క్షీణించిన పారిశుధ్యం, ఏకైక చేతిబోరుతో అంతంతమాత్రంగా ఉన్న నీటి సౌకర్యం, నిలువ నీడలేని దుస్థితి ఇలా సవాలక్ష సమస్యలతో మృతదేహాలకు దహనసంస్కారాలు నిర్వహణకు ఈ ప్రాంతీయులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక వర్షాలు కురిస్తే మృతుల కుటుంబీకుల కష్టాలు చెప్పనలవికాదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, శివశక్తినగర్‌లోని శ్మశానవాటికలో అవసరమైన సౌకర్యాలను కల్పించి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండి ఉన్న శ్మశానవాటిక


దహనం చేసే ప్రదేశంలో కనీసం షెడ్‌లేని శివశక్తినగర్ శ్మశానవాటిక

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతున్నాయి. అండర్-14 బాలురు, బాలికల విభాగంలో వివిధజిల్లాలకు చెందిన జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. శనివారం జరిగిన పోటీల ఫలితాలు, విజేతలను ఎస్‌జిఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ వెంకటరెడ్డి తెలియజేశారు. బాలుర విభాగంలో విజయనగరం జట్లు నెల్లూరుపై 7-19 పాయింట్ల తేడాతోనూ, గుంటూరు జట్టు, పశ్చిమగోదావరిపై 14-13పాయింట్ల తేడాతో, అనంతపూర్ జట్టుపై చిత్తూరు జట్లు 12-10 పాయింట్ల తేడాతో, ప్రకాశం జట్లుపై కర్నూల్ జట్లు 11-6 పాయింట్ల తేడాతో, నెల్లూరుపై శ్రీకాకుళం బాలుర జట్టు 1-0 తేడాతో, కడపపై చిత్తూరు బాలుర జట్టు 19-11తేడాతో విజయం సాధించాయి. ఇక బాలికల విభాగంలో కృష్ణా జిల్లాజట్టుపై అనంతపూర్ జట్టు9 పాయింట్ల తేడాతోనూ, కడప జట్టుపై విజయనగరం జట్టు 11 పాయింట్ల తేడాతోనూ, నెల్లూరు జట్టుపై విశాఖ జట్టు 14-5 పాయింట్లతోనూ, నెల్లూరుపై కడప బాలికల జట్టు 2 పాయింట్ల తేడాతో, పశ్చిమ గోదావరి జట్టుపై చిత్తూరు జట్టు 12-11 పాయింట్ల తేడాతో, ప్రకాశం జట్టుపై తూర్పు గోదావరి జట్టు 8-7 పాయింట్ల తేడాతో, విజయనగరం జట్టుపై విశాఖ బాలికల జట్టు 6-4 పాయింట్ల తేడాతో గెలుపొందాయి.కష్ణాపై గుంటూరు జట్టు 14-12 పాయింట్ల తేడాతో, ప్రకాశంపై విశాఖ జట్టు 17-6 తేడాతో, పశ్చిమ గోదావరిపై కష్ణా జట్టు 12-10 తేడాతో విజయం సాధించాయి.

12వ వార్డులో టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు 12వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో తోగరువు, గణబాబు నగర్, బిటిఆర్.నగర్, సూర్యతేజ నగర్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి,ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ టిడిపి అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి పోలారావు, గాడి సత్యం, ఒమ్మి పైడిరాజు పాల్గొన్నారు.

మోడీ విధానాలు అప్రజాస్వామికం

ప్రజాశక్తి -గాజువాక: కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ చర్యలు అప్రజాస్వామికమని సిపిఐ నేతలు మండిపడ్డారు. శనివారం 72వ వార్డు చైతన్యనగర్‌లో జి.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన శాఖా సమావేశంలో సిపిఐ శాఖా కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి, పొనగంటి భాస్కర్, పెంటకోట నర్సింగరావు, ఎం.రామారావు, మహిళా నేతలు కెవి.కుమారి , అప్పారి శ్రీలక్ష్మి , పిల్లా సూర్యపద్మ పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట


ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు

మహాశివరాత్రిని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు , అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీలు సందర్శకులకు ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేశాయి.

ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం

కలెక్టరేట్ : మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని అన్ని శైవ దేవాలయాలు కిటకిటలాడాయి. కలెక్టరేట్ సమీపంలోని అతి పురాతన వైశాకేశ్వరాలయానికి (బుచ్చిరామలింగేశ్వర) భక్తులు పోటెత్తారు. ఆనంద (బెల్లం గణపతి), త్రిశక్తి అన్నపూర్ణ, సూర్య భగవానుల విగ్రహాలు ఇక్కడ ఉన్నాయి. వన్ టౌన్‌లోని 400 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రాచీన శివాలయానికి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మెయిన్ రోడ్డులోని విశ్వేశ్వర ఆలయం, సూర్య బాగ్‌లోని ఉమా రామలింగేశ్వర ఆలయం, గొల్లలపాలెం విశ్వనాథ్ రోడ్డులో ఉన్న ఓంకార్ ఆలయం, పోలీస్ బ్యారెక్స్ వద్ద ఉన్న రామలింగేశ్వర ఆలయం, టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న శివరామకృష్ణ ఆలయం, బురుజుపేట శివాలయం, దొండపర్తి జంక్షన్‌లో ఉన్న ఎరుకుమాంబ ఆలయం, రైల్వే న్యూ కాలనీలోని శ్రీ నీలకంఠేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

మేయర్ దంపతుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-ఆరిలోవ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆరిలోవ కాలనీ, నెహ్రూనగర్, డ్రైవర్స్ కాలనీ, పెదగదిలి, చినగదిలి, దీనదయాల్‌పురం, కైలాస్‌నగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్ పరిసర ప్రాంతాల్లోని శివాలయాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు. అభిషేకాలు నిర్వహించారు. కైలాసనగర్‌లోని శివాలయంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

మధురవాడ : జివిఎంసి ఏడోవార్డు మానం ఆంజనేయులు నగర్‌లోని లలిత త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పూజలకుప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

ఆనందపురం : మండలంలోని ఆనందపురం, పొడుగుపాలెం, గుడిలోవ, గిడిజాల, కణమాం పంచాయతీ అరిగిమేరక, శొంఠ్యాం తదితర గ్రామాల్లోని శివాలయాలు తెల్లవారుజాము నుండి భక్తులతో కిటకిటలాడాయి. పొడుగుపాలెంలో ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి శివరాత్రి పూజల్లో పాల్గొన్నారు గుడిలోవలో ఆలయ చైర్మన్ కోరాడ గిరిరాజు భక్తులకు ఇబ్బందులు లేకుండా శివరాత్రి పూజలకు ఏర్పాట్లు చేశారు. కనమాం పంచాయతీ అరిగిమేరకలో స్థానిక యువ నాయకుడు పినిశెట్టి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

సింహాచలం: సింహగిరిపైనున్న త్రిపురాంతకస్వామి ఆలయం, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, కొండదిగువ అడవివరం శివాలయం, కుమ్మరిదిబ్బ శివాలయం, విజనగిరిపాలెం శివాలయంలో మహాశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునుంచే అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

108 లింగాలతో ప్రదోషకాల శతరుద్రాభిషేకం

ఎంవిపి కాలనీ : విశాఖ సాగరతీరంలో విశ్వభారత్ మీడియా ఆధ్వర్యాన లింగోద్భవ కాల రుద్రాభిషేకం నిర్వహించినట్లు మీడియా చైర్మన్ బలివాడ రమేష్, మేనేజింగ్ డైరెక్టర్ భీమరశెట్టి వాసుదేవ్ (కిషోర్) తెలిపారు. శివరాత్రి జాగరణతో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రుద్ర హవనం, ప్రదోషకాల శతరుద్రాభిషేకం (108 లింగాలతో), పాశుపత హోమం వంటి విశేష, విశిష్ట పూజలు జరిపినట్లు పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... దేవరాపల్లికి చెందిన బొత్స శ్రీను(29) రెండేళ్లుగా భార్య పిల్లలతో సాయినగర్ కాలనీలో నివాసముంటున్నాడు. మండలంలోని రోహిణి మినరల్స్ ప్రై లిమిటెడ్ కంపెనీలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల శ్రీను భార్య శ్యామల అమ్మమ్మ మరణించడంతో భార్య తన పిల్లలతో రావికమతం వెళ్లి ఉంటోంది. శ్రీను కూడా రావికమతం వెళ్లి సబ్బవరం కంపెనీకి మూడు రోజులుగా బైక్‌పై వస్తూ వెళ్తున్నాడు. శ్రీను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సబ్బవరం సాయినగర్‌లో తను ఉంటున్న అద్దె ఇంటికి వచ్చి ఉన్నారు. శనివారం ఉదయం శ్రీనుతో పని చేస్తున్న కంపెనీ మిత్రులు ఫోన్ చేశారు. ఫోన్ రింగ్ అవుతున్నా జవాబు ఇవ్వక పోవడంతో మిత్రులు శ్రీను ఇంటికి వచ్చి చూశారు. హాలు తలుపు తీసి ఉంది. బెడ్ రూమ్‌లో తలుపు వేసుకొని ఉండడంతో కిటికీలో నుండి చూశారు. ఫ్యాన్‌కి ఉరేసుకుని శ్రీను ఉండడం చూసిన మిత్రులు వెంటనే తలుపు విరగ్గొట్టి చూశారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్రీను మృతికి కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సిఐ రంగనాథం తెలిపారు. మృతుని సెల్ సీజ్ చేసినట్లు చెప్పారు. మృతుని భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి :నక్కపల్లి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ రాయవరానికి చెందిన బాబీ, హరి, కల్యాణ్ బైక్‌పై అడ్డురోడ్డు నుంచి నక్కపల్లి వస్తుండగా, హాస్పటల్ జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న వ్యానును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ యువకులను స్థానికులు వెంటనే స్థానిక సిహెచ్‌సికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్సను అందించారు.

అలరించిన రోహిత్‌రాక్స్ సంగీత ప్రదర్శన


కేన్సర్‌ను జయించిన మహిళతో డాక్టర్ రఘునాధరావు తదితరులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : బీచ్ రోడ్డులోని పార్కు హోటల్‌లో రోహిత్ మెమోరియల్ ట్రస్టు నిర్వహించిన బ్లాక్ బస్టర్ సంగీతం-రోలింగ్ బ్యాక్ ది ఇయర్స్, అంతర్జాతీయ సంగీత ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. కేన్సర్ కార్యక్రమాలు నిర్వహించేందుకు నిధుల సమీకరణ నిమిత్తం రోహిత్ రాక్స్ సంగీత ప్రదర్శన నిర్వహించినట్లు ట్రస్టు డైరెక్టర్లు తెలిపారు. 1950, 60, 70లకు చెందిన ఎల్టన్ జాన్, అబ్బా, మోటౌన్ ఇంక్, డయానా రోస్, మైకేల్ బబుల్, ఫ్రాంక్ సినట్రా తదితర ప్రముఖుల సంగీతంతో కార్యక్రమం సాగిందని వివరించారు. అంతర్జాతీయ సంగీతకారులు, నృత్యకారులతో ప్రదర్శన ఆకట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్, కిమ్స్ ఐకాన్ చీఫ్ మెడికల్ ఆంకాలజిస్ట్ దిగుమర్తి రఘునాధరావు, కోస్టల్ కార్పొరేషన్ ఎమ్‌డి టి.వల్సరాజ్, ట్రస్టు డైరెక్టర్లు, ప్రాజెక్టు డైరెక్టర్ గుర్మీత్ కోహ్లీ, శారద వంక పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం :వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మొకర నారాయణరావు జ్ఞాపకార్థం భీమిలిలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు విశ్రాంత ప్రిన్సిపాల్ కెఎస్ఆర్ కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, చరిత్ర, ప్రభుత్వ పాలనాశాస్త్రం, సామాజిక శాస్త్రం, తెలుగు, హిందీ సాహిత్యం తదితర సబ్జెక్టుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 89856 47419 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

యువతకు సీనియర్ క్రికెటర్లు ఆదర్శం

ఘనంగా కోచ్ కృష్ణారావు జన్మదిన వేడుకలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యేనాగిరెడ్డి

ప్రజాశక్తి–గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంతానికి చెందిన సీనియర్ క్రికెట్ కోచ్ కృష్ణారావు (గాంధీ) జన్మదిన వేడుకలు శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాజువాక సీనియర్ క్రికెటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఎంతో మంది యువతకు క్రికెట్‌లో శిక్షణనిచ్చి, వారిని ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో కోచ్ కృష్ణారావు పాత్ర ఎనలేనిదన్నారు. 40ఏళ్ల వయస్సులోనూ క్రికెట్ ఆడుతూ, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న గాజువాక సీనియర్స్ క్రికెటర్స్ నేటి యువతకు ఆదర్శమని ప్రశంసలు కురిపించారు. సీనియర్ క్రికెటర్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కసిరెడ్డి నూకరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ నేత కసిరెడ్డి సత్యనారాయణ, ఇడిసిఎ జాయింట్ సెక్రటరీ పురుషోత్తం రెడ్డి, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీను, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి



మొక్కలు నాటుతున్న పోలీసులు

ప్రజాశక్తి –మాధవధార : విశాఖ నగరంలో నానాటికీ పెరిగిపోతోన్న కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కంచరపాలెం సిఐ ఎస్.విజయకుమార్ పిలుపునిచ్చారు. శనివారం శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటడం ముఖ్య పరిష్కారమన్నారు. శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు కీర్తి పట్నాయక్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జె దివ్యభారతి, హెడ్‌కానిస్టేబుల్ బి సతీష్, కానిస్టేబుల్స్ భూలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు



దగ్గుబాటి దంపతులు

ప్రజాశక్తి– సింహాచలం: సింహాద్రి అప్పన్నను మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కేంద్ర మాజీ మంత్రి దగ్గుపాటి పురందేశ్వరి, రాష్ట్ర మాజీ మంత్రి వెంకటేశ్వరరావు దంపతులు, లీగల్ మెట్రాలజీ అండ్ రోడ్ సేఫ్టీ డిజి కెఆర్ఎం కిషోర్‌కుమార్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురపు కనకరాజు, ఇఇ శ్రీనివాసరాజులు సాదర స్వాగతం పలికారు. ఆలయంలో కప్ప స్తంభం ఆలింగనం, బేడా మండప ప్రదక్షిణ, స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలోను గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా అధికారులు స్వామి ప్రసాదాన్ని అందించారు.

ఎట్టకేలకు రైతుబజారు నిర్మాణం

- స్థలం అప్పగించక మూడేళ్లుగా పనుల్లో జాప్యం
- చురుగ్గా నిర్మాణంతో రైతులు, కొనుగోలుదారుల హర్షం



నిర్మాణంలో ఉన్న రైతుబజారు

ప్రజాశక్తి –తగరపువలస : జివిఎంసి రెండో వార్డులో రైతుబజారు నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. 2019లోనే రైతుబజారు మంజూరైనప్పటికీ, మార్కెటింగ్ శాఖకు స్థలం అప్పగింతలో జివిఎంసి జాప్యం వల్ల మూడేళ్లకు పైగా నిర్మాణ పనుల్లో ఎటువంటి కదలిక లేకుండా పోయింది. దీంతో రైతు బజారు ఏర్పాటౌతుందా? లేదా? అని రైతులు, స్థానికుల్లో అయోమయం, ఆందోళన నెలకొన్నప్పటికీ, ఎట్టకేలకు పనులు ప్రారంభం కావడంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రెండో వార్డు మీసేవా కేంద్రం సమీపంలో, గతంలో ఎన్‌టిఆర్ కల్యాణ మండపం ఉన్న స్థలం లో రైతు బజారు ను ప్రభుత్వం మంజూరు చేసింది. 1837.82 చదరపు గజాల విస్తీర్ణంలో, రూ.78 లక్షల మార్కెటింగ్ శాఖ నిధులతో 50 దుకాణాల సముదాయాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మించాలని సంకల్పించారు. 2019లోనే రైతు బజారు మంజూరైనప్పటికీ, మార్కెటింగ్ శాఖకు స్థలం అప్పగింతలో జివిఎంసి తీవ్ర జాప్యం నెలకొనడంతో ఒకానొక దశలో రైతు బజారు ఏర్పాటుపై సందిగ్ధత నెలకొంది. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2021 జూలై 5న రైతు బజారు మంజూరైనట్లు మళ్లీ ప్రకటించారు. అయితే ఈసారి కూడా పనులు చేపట్టడంలో అలసత్వం నెలకొంది. కొండ ప్రాంతం కావడంతో నిర్మాణపనుల్లో కొంత జాప్యమైనప్పటికీ, ఎట్టకేలకు ప్రారంభమై, ఇపుడు శరవేగంగా సాగుతున్నాయి.

రైతులు, కొనుగోలుదారులకు ప్రయోజనకరం

భీమిలి మండలం లక్ష్మీ పురం, తాటితూరు, మజ్జిపేట, మజ్జివలస, దాకమర్రి, జివిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడ తదితర గ్రామాల్లో కూరగాయలు ఎక్కువగా పండిస్తారు. అలానే ఆనందపురం, పద్మనాభం, భోగాపురం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు కూరగాయలు సాగుచేస్తున్నారు. వీరికి సరైన మార్కెటింగ్ సదుపాయం లేక, స్థానిక ప్రైవేట్ మార్కెట్‌కు వ్యయప్రయాసలకోర్చి తీసుకొచ్చి, దళారులు, వ్యాపారులకు వారుచెప్పిన ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి.

రైతు బజారు ఏర్పాటైతే అటు రైతులు మార్కెటింగ్ సౌకర్యం, ఇటు కొనుగోలుదారులకు తాజా కూరగాయలు అందుబాటు ధరలో లభించడం ద్వారా ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు. మధ్య దళారీలు, వ్యాపారుల జోక్యం లేకుండా కూరగాయలు లభించనున్నాయి. ప్రస్తుతం చురుగ్గా సాగుతున్న రైతు బజారు నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే దుకాణ వసతితోపాటు మరుగుదొడ్ల,తాగునీరు, పార్కింగ్ ఇతరత్రా అన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా అటు రైతులు, ఇటు కొనుగోలు దారులకు ఇబ్బందులు తొలగినట్లే.

ఇబ్బందులు తొలగినట్లే...



ఎంతో కష్టపడి, అప్పులు చేసిమదుపులు పెట్టి కూరగాయలు పండిస్తున్నాం. దూరాభారమైన వ్యయ ప్రయాసలకోర్చి ఆటోల్లో ఇక్కడి ప్రయివేటు మార్కెట్‌కు తీసుకొస్తున్నాం. అయినా గిట్టుబాటు ధర రాక, వచ్చిన రేటుకు అమ్మి నష్టపోతున్నాం.రైతు బజారు ఏర్పాటైతే ఈ కష్టాలన్నీ తొలగినట్టే.

పైడితల్లి, రైతు, పాత కొవ్వాడ పద్మనాభం మండలం



తగరపువలస ప్రయివేటు మార్కెట్‌లో కూరగాయలతో రైతులు

చాలా ఉపయోగకరం



టొమాటో, బెండ పండిస్తున్నాం. రైతు బజారు లేకపోవడంతో బయట మార్కెట్లోనే విక్రయిస్తున్నా. రైతు బజారు ఏర్పాటైతే మాకు, అటు కొనేవాళ్లకు ఉపయోగమే. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేసి, రైతుబజారు అందుబాటులోకి తేవాలి.

వెంకట రమణ, రైతు, కొవ్వాడ, పద్మనాభం మండలం

ప్రజాస్వామ్య వ్యవస్థలపై ధన ప్రలోభం

పంజాబ్ వర్సిటీ విశ్రాంత ఎకనమిక్స్ ప్రొఫెసర్ బల్వీందర్‌సింగ్ తివానా

గీతంలో ముగిసిన ఐపిఇఎ 26వ వార్షిక సమావేశాలు



ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి– మధురవాడ : ప్రజాస్వామ్యంలోని వ్యవస్థల న్నింటినీ నిర్వీర్యం చేసేలా ధన వినియోగం కీలక పాత్ర వహిస్తుండటం విచారకరమని పంజాబ్ విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ బల్వీందర్ సింగ్ తివానా ఆవేదన వ్యక్తం చేశారు.. ఏపి ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యాన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇండియన్ పొలిటికల్ ఎకానమీ అసోసియేషన్ (ఐపిఇఎ) 26వ వార్షిక సమావేశాలు శనివారం ముగిసాయి.ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ బల్వీందర్‌సింగ్ మాట్లాడుతూ, అధికారం కోసం కార్పొరేట్ సంస్థల నిధులతో చట్టసభల సభ్యులను కొనుగోలు చేయడం బాధాకరమన్నారు. దేశంలో రాజకీయ పార్టీలు, కార్పొరేట్ సంస్థలు కలిసి నడుస్తున్న తీరును ప్రజలు అర్థం చేసుకొని, వాటి పర్యవసానాలను గమనించాలన్నారు. పంజాబ్‌లో రైతులు, మేధావులు, వివిధ వర్గాల ప్రజలతో నడిచిన రైతు ఉద్యమాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశ ప్రజల భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాలని ప్రభుత్వాలను కోరారు. ఐపిఇఎలో తీర్మానాలను వెల్లడించారు.

ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ డైరక్టర్ ప్రొఫెసర్ గాలిబ్ మాట్లాడుతూ సమాజ హితానికి, ప్రణాళికల రూపకల్పనకు దోహదపడేలా రాజకీయ ఆర్థిక శాస్త్రంపై పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్) ఆర్థిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ కె.కల్యాణ్ మాట్లాడుతూ, ఆర్థిక, రాజనీతి శాస్త్రాల సమ్మిళిత ప్రభావాలను వివరించారు.కార్యక్రమంలో హైదరాబాద్ యూనివర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం డీన్ ప్రొఫెసర్ ఆర్‌వి.రమణమూర్తి, సమావేశాల కన్వీనర్ డాక్టర్ ధనుంజయకుమార్, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ బి.నళిని పాల్గొన్నారు. సమావేశాలలో పాల్గొన్న ప్రతినిధులకు ఐపిఇఎ సర్టిఫికెట్లను అందజేశారు.

ఢిల్లీ బృందం స్టడీ టూర్

ప్రభుత్వ డైట్, కస్తూర్బాల సందర్శన



భీమిలి డైట్‌లో ఢిల్లీ బృందంతో ఆర్‌జెడి, డిఇఒ తదితరులు

ప్రజాశక్తి –భీమునిపట్నం : డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఢిల్లీ సభ్యుల బృందం స్టడీ టూర్‌లో భాగంగా, శనివారం స్థానిక ప్రభుత్వ డైట్, కస్తూర్బా పాఠశాలలను సందర్శించారు. ఢిల్లీ ఎస్‌సిఇఆర్‌టి ప్రిన్సిపల్ శ్రీరామ్ కిషోర్, రును చౌదరి, వైస్ ప్రిన్సిపల్ సునీత మిట్టల్ నేతృత్వంలోని బృందానికి ఎపిలో అమలవుతున్న విద్యావిధానాన్ని పిపిటి ద్వారా డైట్ ప్రిన్సిపల్ యు మాణిక్యంనాయుడు వివరించారు.పరస్పర స్టడీ టూర్లతో పాఠశాల నిర్వహణ, బోధనాసామర్థ్యం మెరుగుకు దోహదపడతాయని విద్యాశాఖ ఎం.జ్యోతి కుమారి అన్నారు. డైట్‌లో విద్యావిధానం, శిక్షణ తరగతులు, ఇతర కార్యక్రమాలపై ఢిల్లీ బృందానికి డైట్ అధ్యాపకులు వివరించారు.

ఈ సందర్భంగా ఢిల్లీలో అమలవుతున్న దేశభక్తి, హ్యాపీ కరికులం గురించి స్థానిక అధ్యాపకులు, ఉపాధ్యాయులకు ఆతిథ్య బృందం వివరించింది. కార్యక్రమంలో డిఇఒ ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఎపిసి బి శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ ఎ.గౌరీశంకరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఢిల్లీ బృందంలోని సభ్యులను డైట్, కెజిబివిల్లో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

తెరమరుగు కానున్న తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ!

- లిక్విడేటర్‌ను నియమిస్తూ ఆదేశాలు
- బాధ్యతలు స్వీకరించిన శాస్త్రి

ప్రజాశక్తి -అనకాపల్లి

సహకార రంగంలో దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన తుమ్మపాల వివి.రమణ సహకార చక్కర కర్మాగారం చరిత్ర తెరమరుగు కానుంది. జిల్లాలోనే అత్యంత పురాతన ఫ్యాక్టరీగా రైతుల మూలధనంతో సహకార రంగంలో నేటి వరకు కొనసాగింది. ఈ ఫ్యాక్టరీని విక్రయించేందుకు పలు దఫాలు ఆయా ప్రభుత్వాలు ప్రయత్నం చేశాయి. ఫ్యాక్టరీకి నష్టాలు వస్తున్నాయని మిషతో గత తెలుగుదేశం ప్రభుత్వం విక్రయించేందుకు ప్రయత్నించగా అప్పట్లో చెరకు రైతులు, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించి ఆందోళన చేపట్టడంతో వెనక్కు తగ్గింది. గత నాలుగేళ్లుగా సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ జరపలేదు. ఫ్యాక్టరీని మూత వేయడంతో రైతుల పేమెంట్లు, కార్మికుల జీతాల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తుమ్మపాల ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఫ్యాక్టరీకి పూర్వ వైభవం వస్తుందని ఈ ప్రాంతీయులు, కార్మికులు, రైతులు ఎంతో ఆశపడ్డారు. ఫ్యాక్టరీపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 15 వేల కుటుంబాలు ఆధారపడి ఉండేవి. ఇప్పుడు ఫ్యాక్టరీని ఆధునికీకరించకపోగా, ప్రస్తుతం ఫ్యాక్టరీ అప్పులు, ఆస్తులు నిర్ణయించేందుకు సుగర్ కేన్ కమిషనర్ లిక్విడేటర్‌ను నియమించారు. ఫ్యాక్టరీలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ నేపథ్యంలో సుగర్ కేన్ కమిషనర్ శనివారం లిక్విడేటరు పివిఎస్ శాస్త్రిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేయగా, ఆయన బాధ్యతలు చేపట్టారు. దీంతో లిక్విడేషన్ ప్రాసెస్ చేసేందుకు ఆయన సంసిద్ధులవుతున్నారు. ఆయన ఇచ్చిన నివేదికపై ఆధారపడి ఫ్యాక్టరీ ఆస్తులను అమ్మి అప్పులు తీర్చగా మిగిలిన సొమ్ము సభ్య రైతులకు అందజేసే అవకాశం ఉంది. అదే గనుక జరిగితే ఎంతో ఘన చరిత్ర ఉన్న ఈ సుగర్ ఫ్యాక్టరీ తెరమరుగు కావడం తథ్యం.



తుమ్మపాల వివి.రమణ సహకార చక్కెర కర్మాగారం (ఫైల్‌ఫొటో)



భూదేవి రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బాలేపల్లి తదితరులు

ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై జగన్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఈ ప్రాంతానికి జీవనాడి అని, అటువంటి ప్రాజెక్టుపై వైఎస్.జగన్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఆరోపించారు. శనివారం బాలేపల్లి వెంకటరమణ, సిపిఐ నాయకులు భూదేవి రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించారు. దీనికి ముందు ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఒక నయా పైసా కూడా కేటాయించలేదన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సుమారు ఎనిమిది లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 1500 గ్రామాలకు తాగునీటి సదుపాయం, 4.74 టిఎంసిల నీటిని పరిశ్రమలకు అందించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ఈ ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రాజెక్టుల పురోగతిని పరిశీలిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఈనెల 22వ తేదీన భూదేవి రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, మండల కార్యదర్శి గొర్లె దేవుడు బాబు, నాయకులు రెడ్డి అప్పలనాయుడు, ఇల్లాకు రాము తదితరులు పాల్గొన్నారు.



గ్రోయిన్‌ను పరిశీలిస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్

కస్పా గ్రోయిన్ పునర్నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది వద్ద కస్పా గ్రోయిన పునర్నిర్మాణ పనులు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ శనివారం పరిశీలించారు. రూ.80 లక్షలు విశాఖ డెయిరీ నిధులతో చేపట్టిన గ్రోయిన్ పునర్నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కోమల్లపూడిలో శివపార్వతుల విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు దాడి సూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి డిఎస్‌పి సునీల్‌పై వేటు?

- విఆర్‌లో ఉంచినట్లు సమాచారం
- ఇన్‌ఛార్జి డిఎస్‌పిగా మళ్ల మహేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి



డిఎస్‌పి సునీల్

అనకాపల్లి డిఎస్‌పిగా పనిచేసిన బి.సునీల్‌ను బదిలీ వేటు పడినట్లు తెలిసింది. ఈ మేరకు చీఫ్ ఆఫీసు నుంచి ఆదేశాలు వచ్చినట్టు విశ్వసనీయ వర్గాల బోగట్టా. సుమారు రెండేళ్లగా డిఎస్‌పిగా పనిచేస్తున్న సునీల్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ శాఖ సీజ్ చేసిన వాహనాన్ని వినియోగించినందుకు ఆయనను తీవ్రంగా మందలించిన ఎస్పీ, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఎస్పీ సునీల్ సెలవుపై వెళ్లారు. అయితే హెడ్ క్వార్టర్ చీఫ్ ఆఫీస్ నుంచి ఆయన్ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది. సునీల్‌ను విఆర్‌లో ఉంచినట్టు బోగట్టా. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి డిఎస్‌పిగా దిశ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి మళ్ల మహేశ్వరరావును నియమిస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

22, 23 తేదీల్లో జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

విజయవంతం చేయాలి : డిఇఒ వెంకట లక్ష్మమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ వెంకట లక్ష్మమ్మ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 22 23 తేదీల్లో జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ పిలుపునిచ్చారు. జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఎగ్జిబిషన్‌కు చైర్మన్‌గా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వ్యవహరించనున్నారని తెలిపారు. మండల స్థాయిలో ప్రదర్శించి అక్కడ జిల్లాకు ఎంపికైన పరిశోధనలు ఈ జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందన్నారు. విద్యాశాఖ స్థాయిలోని అన్ని స్థాయిల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేసి ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపవిద్యా శాఖ అధికారి ప్రేమ కుమార్, విద్యాశాఖ సహాయ సంచాలకులు ఆడారి రవి బాబు, ఎంఈఓ డి.దివాకర్, ఏఎమ్ఓ వెంకటేశ్వరరావు, కొణతాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనకాపల్లి



మాట్లాడుతున్న నాగజగదీష్

రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను పోలీసులు కాలరాస్తున్నారని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు వారిపట్ల నమ్మకం పోయేలా జగన్ రెడ్డి ప్రభుత్వం ఆదేశాలను పాటిస్తున్నారని తెలిపారు. భారతదేశ రాజముద్రను ధరించి రాజ్యాంగ నియమాలను విలువలను పాటిస్తామని ప్రమాణం చేసి ఉద్యోగంలో చేరిన పోలీసులు ప్రభుత్వ ఆదేశాలకు తలవొగ్గి వైసిపి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జగన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు తమకు పోలీసులపై నమ్మకం లేదని అవమానించి దూషించిన విషయాన్ని గుర్తు చేశారు. పోలీసులు అన్ని పార్టీల పట్ల ఒకే విధమైన నిబంధనలు పాటించాలన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు అడుగడుగున ఆటంకాలు కల్పిస్తూ నానా యాగి చేయడం దుర్మార్గమన్నారు. తమ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో ఉన్నప్పుడు జెడ్ కేటగిరి రక్షణ కల్పించాల్సిన పోలీసులే ఆయన వాహనం ముందు ధర్నా చేయడం, డివిజనల్ స్థాయి అధికారి పోలీసులను కింద కూర్చోవాలని ఆదేశాలు ఇవ్వడం పోలీసు వ్యవస్థకే కళంకం అని విమర్శించారు. ఇకనైనా ఉద్యోగ ధర్మాన్ని పాటించి పోలీసుల పట్ల నమ్మకం ప్రజలకు కలిగేలా వ్యవహరించాలని హితవు పలికారు.

వైవి.రావు మృతి కార్మిక వర్గానికి తీరనిలోటు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వైవి రావు మృతి కార్మిక వర్గానికి తీరని లోటని ఏఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ అన్నారు. వైవి రావు ఈనెల 17న గుండెపోటుతో మృతి చెందారని, ఆయన ఆర్టీసీ కార్మిక హక్కుల కోసం, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మృతి పట్ల ఏఐటీయూసీ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తుందన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని మార్టూరు గ్రామంలో నూకాంబిక అమ్మవారి పండగ మహోత్సవ సందర్భంగా శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నూకాంబిక దేవస్థానం చైర్మన్ కెకె.శ్రీనుబాబు, సెక్రటరీ కెవి.రమణ తదితరులు ప్రారంభించారు. కీర్తిశేషులు గట్ట నారాయణరావు, గుర్రం నాగేశ్వరరావు, కాకి సన్యాసి పైడిరాజు జ్ఞాపకార్థం నూకంబిక యూత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించినట్లు కెవి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి 60 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో గ ఎంపిటీసీ మాజీ సభ్యుడు గుర్రం అప్పారావు, నాయకులు జి నారాయణ బాబు, కెకె.హరిబాబు, కె.తారకేసు, జి.వెంకట్, జి.చిరంజీవి, ఎల్ చిన్నారావు, ఆర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మరమ్మతులు చేసిన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - కశింకోట

మండలంలోని తాళ్ళపాలెం సంతలో ఉన్న ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం ముందు భవనానికి మరమ్మతులు చేయగా, ఈ భవనాన్ని శనివారం మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మీయ చింతనకు దేవాలయం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉగ్గిన పాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, వైసిపి నాయకులు అద్దంకి సత్యనారాయణ, చిన్ని వల్లభ నారాయణరావు, ఇల్లపు శ్రీను పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి కలగా లక్ష్మి

ప్రభుత్వ తీరుపై టిడిపి నిరసనలు

అంబేద్కర్ విగ్రహాలకు వినతులు



దేవరాపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విషయంలో వైసిపి ప్రభుత్వం తీరుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం దేవరాపల్లిలో నల్లజెండాలు చేతబట్టి నిరసన ప్రదర్శన చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన చేస్తుందంటూ ఆరోపిస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి కుమార్ మాట్లాడుతూ అటు లోకేష్ పాదయాత్రను, ఇటు చంద్రబాబు కార్యక్రమాలను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో కాశీపురంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ సత్యవతి, టిడిపి నాయకులు పోతల పాత్రునాయుడు, కరుణాకర నాయుడు, కర్రి నాయుడు, డీడీ నాయుడు, గుల్లేపల్లి చిరంజీవి, చల్లా నానాజీ, బండారు రామారావు, చింతా సాంబమూర్తి, కిల్లి గోవిందు, బండారు అప్పలనాయుడు, దేముళ్లు, బుజ్జి, వాకపల్లి పాత్రుడు, బాబురావు, రాయపురెడ్డి ఈశ్వరరావు, పెంటయ్య, జగ్గారావు, శ్రీను, తమడాన ప్రసాద్, కడిమి నాగేశ్వరరావు, ప్రసాద్, మూత్యలరావు, సంజీవ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోడ్ షోను పోలీసులు అడుగడుగునా అడ్డుకుని, కార్యకర్తలపై దౌర్జన్యాన్ని నిరసిస్తూ శనివారం నక్కపల్లి లో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేశ్ ఆద్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్ళకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు సమర్పించి, రాజ్యాంగాన్ని కాలరాస్తున్న ప్రభుత్వం నశించాలని నినాదాలు చేశారు. పోలీసుల తీరుపై ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, గింజాల లక్ష్మణరావు, మీగడ సత్యనారాయణ, వైబోయిన రమణ, ప్రగడ వీరబాబు, అడ్డూరి లోవరాజు, శ్రీనివాసరావు, సింహాద్రి, సన్యాసిరావు, తాతారావు, ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, వీరబాబు, అప్పారావు, శ్రీనివాసరావు, సింహాద్రి, పెదకాపు, దివానం, గంగరాజు, రాము, బాబ్జి , నూకరాజు పాల్గొన్నారు.

యస్.రాయవరం : తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు అడ్డుకోవడంపై మండలంలోని పెదగుమ్ములూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్ళకు గంతలు కట్టుకుని నల్ల బ్యాడ్జిలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ యేజర్ల వినోద్ రాజు మాట్లాడుతూ,మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష పార్టీ నాయకుడు ప్రజా సమస్యలపై పర్యటన చేస్తుంటే ప్రస్తుత ముఖ్యమంత్రి కి చెమటలు పడుతున్నాయని విమర్శించారు. ప్రజల్లో వస్తున్న ఆధరణకు భయపడి ఇటువంటి నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విధంగా గత టిడిపి ప్రభుత్వం ఆలోచించి ఉంటే జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో పర్యటించేవారా అని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు అమలకంటి అబద్దం, గుర్రం రామకృష్ణ, కోన అప్పలరాజు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

కోటవురట్ల : మండల కేంద్రంలో శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడుకు ప్రజలు చూపిస్తున్న ఆదరణ చూసి ముఖ్యమంత్రి జగన్‌కు చెమటలు పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమ ంలో బీసీ సెల్ అధ్యక్షులు వి.భాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, సుంకర బాబ్జి, కసిరెడ్డి యేసు, తంగేటి శ్రీను, లోవరాజు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్.రాయవరం పెదగుమ్ములూరులో బైఠాయింపు



కోటవురట్లలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

వ్యకాస ఆలిండియా కౌన్సిల్ సభ్యులుగా వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి



వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా కౌన్సిల్ సభ్యునిగా సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న ఎన్నికయ్యారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హౌరా సిటీలోని ఈ నెల 14 నుండి 18వ తేదీ వరకు జరిగిన ఆలిండియా అగ్రికల్చరల్ వర్కర్స్ యూనియన్ (ఎఐఎడబ్ల్యుయు) 10వ మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ మహాసభలో ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకొనేందుకు, భూ సమస్యల పరిష్కారానికి, ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి ఉద్యమించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 5న చలో డిల్లీ కార్యక్రమం నిర్వహించాలని, రైతులకు, వ్యవసాయ కార్మికులకు బడ్జెట్లో పూర్తి స్థాయిలో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై దాడులు అరికట్టాలని, మతోన్మాద విచ్ఛిన్నకర శక్తుల నుండి పేదలను రక్షించాలని, పేదల సొంతింటి కల నెరవేర్చాలని కోరారు. .



ఎడ్ల పరుగు పందెం విజేతలకు బహుమతులు అందజేస్తున్న బూడి

ఘనంగా దేముళ్లమ్మ పేరంటాలు తీర్థం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి సమీపంలోని ఒడ్డు చింతల కల్లాలలో దేముళ్లమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన కోలాటం, తప్పెడ గుళ్ళు వంటి సంప్రదాయ నృత్యాలను స్థానికులతో కలిసి వీక్షించారు. సందర్భంగా ఎడ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించిన విజేతలకు విజేతలకు డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు.

కారు నాయుడు కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - పరవాడ

సీనియర్ పాత్రికేయుడు కీర్తిశేషులు రొంగలి కారునాయుడు కుటుంబానికి పరవాడ జర్నలిస్టుల క్రికెట్ టీం రూ.10వేలు ఆర్థిక సాయం అందించింది. శనివారం బొంకుల దిబ్బ వద్ద ఉన్న కారు నాయుడు స్వగృహానికి వద్దకు వెళ్లి క్రికెట్ టీమ్ వెళ్లి పరామర్శించారు. రెండు రోజుల క్రితం ఫార్మసిటీ గ్రౌండ్లో పరవాడ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రొంగలి కారు నాయుడు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పరవాడ క్రికెట్ టీం విజేతగా నిలిచిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పరవాడ క్రికెట్ టీమ్ సభ్యులు వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ కొంత నగదు వేసుకొని రూ.10వేలు మొత్తాన్ని కారు నాయుడు సతీమణి విజయలక్ష్మికి అందజేశారు. పిల్లలకు క్రికెట్ కిట్టును బహూకరించారు. భవిష్యత్తులో కారు నాయుడు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.లోకేష్, ఎమ్‌డి.రాజు, క్రికెట్ టీం కెప్టెన్ పి.శ్రీను పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న క్రికెట్ టీమ్ సభ్యులు

న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

111వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

ప్రజాశక్తి-రాంబిల్లి

తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని నేవీ నిర్వాసిత జెఎసి పెద్దలు స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి ప్రధాన గేట్ ముందు నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన శనివారం నాటికి 111వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జెఎసి పెద్దలు మాట్లాడుతూ నరసాపురం, కొత్త పట్నం గ్రామాల వారికే ఉపాధి కల్పిస్తామని అధికారులు చెప్పడం సరికాదని, అలా అయితే మిగిలిన ఆరు గ్రామాలు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దీని వల్ల ఆయా గ్రామాలు ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. తమ సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు చిన్న, పెద్ద, ఆడ మగ అందరం గేట్ ఎదుటే ఆందోళన కొనసాగిస్తామని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ ప్యాకేజీలు చెల్లించాలని, జెట్టీ నిర్మాణం చేపట్టాలని, అంత వరకు ఆధార్ ఆధారంగా శారదా, వరహ నదుల గుండా చేపల వేటకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నేవీ నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలం నుండి పెద్దాపురం ప్రాంతానికి మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని శనివారం స్థానిక తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచార్యులు ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. తహశీల్దారు సుబ్రహ్మణ్య ఆచారి తెలిపిన వివరాలు ప్రకారం... మండలం నుండి సుమారు నాలుగు టన్నులు బియ్యాన్ని పీడీఎస్ లబ్ధిదారుల నుండి సేకరించి పెద్దాపురం ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో మండలంలోని ఏవనక రాయి గ్రామం వద్ద తహశీల్దారు సుబ్రహ్మణ్య ఆచారి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. వాహనంలో బియ్యం తరలిస్తున్న పెద్దాపురం మండలం గోరంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని ఎమ్ఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

రాజకీయ విలువలకు నిలువుటద్దం గోవిందరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాజకీయ విలువలకు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ కోడిగంటి గోవిందరావు నిలువుటద్దంలా నిలుస్తారని సిపిఐ నాయకులు కొనియాడారు. స్థానిక నెహ్రూ జంక్షన్‌లో గోవిందరావు 9వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పార్టీ సీనియర్ నాయకులు బుద్ధ మంగయమ్మ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నైతిక విలువలకు కట్టుబడి ఉన్య వ్యక్తి గోవిందరావు అని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ సాగు నీటి వనరుల కోసం పోరాడి సాధించారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం తన ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా త్యాజించినట్లు చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపిన గోవిందరావు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. ఆయన బాటలో నేటి తరం కమ్యూనిస్టులు నడిచినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, కార్యవర్గ సభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు, మండల కార్యదర్శి చెల్లూరి నాగరాజు, తాకాసి వెంకటేశ్వరరావు, ఎంఎ మాధవరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరిబిల్లి శంకర్రావు, కే వీరాచారి, కోన లక్ష్మణ్, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ నాయకులు దూలం బూసిరాజు, కనిశెట్టి సురేష్ బాబు, బాలు గాడి పాల్గొన్నారు.



గోవిందరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

అలరించిన భజన పోటీలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో కుసర్లపూడి గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీరామలింగేశ్వర శివాలయం వద్ద హరిభజన నిర్వహించారు. పాకలపాడు గురువు ఆశ్రమం వద్ద భజన పోటీలు నిర్వహించారు. ఇవి భక్తులను అలరించాయి. భజన బృందం పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ బహమతి రూ.5వేలు, మూడవ బహుమతి రూ.3వేలను ఈనెల 19న ఆదివారం ముఖ్య అతిథిగా రానున్న ముత్యాల వెంకటేశ్వరరావు(ఎంవిఆర్) చేతుల మీదుగా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



గీతాలు ఆలపిస్తున్న భజన బృంద సభ్యులు

ఆర్‌ఐగా రామమూర్తి

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట ఆర్‌ఐగా టి.రామమ్మూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌ఐగా పని చేసిన సత్యనారాయణ డిప్యూటీ తహశీల్దార్‌గా పదోన్నతిపై గతేడాది డిసెంబరు 10న ఇక్కడ నుంచి నర్సీపట్నం బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ పోస్టు భర్తీ చేశారు. అచ్యుతాపురం ఆర్‌ఐగా పని చేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై విధుల్లో చేరారు.

ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

-భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
-పలు చోట్ల అన్న సమారాధనలు



కొత్తకోట సమీపాన కల్యాణపులోవకు తరలి వచ్చిన భక్తులు

మహా శివరాత్రి వేడుకలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో శివాలయాలు కిటకిటలాడాయి. శివరాత్రి సందర్భంగా పలు ఆలయాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి- కె.కోటపాడు : మహాశివరాత్రి సందర్భంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున 3 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు క్యూలో నిలబడి శివుని దర్శించుకున్నారు. చౌడువాడ, కె.కోటపాడు, ఎ.కోడూరు, ఆనందపురం గ్రామాలలో ఉన్న శివాలయాల వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయాల వద్ద మహిళల కోలాటాలు, భజనలు, తప్పుడు గుళ్ళు నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చౌడువాడ, కె.కోటపాడు శివాలయాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో చౌడువాడ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ మల్లికార్జున స్వామి ఆలయంలో వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైలా శ్రీనివాసరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, ఉప సర్పంచ్ బండారు రామరావు, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ చల్ల కనకరావు, వార్డు మెంబర్ పోతాల అప్పలనాయుడు పాల్గొన్నారు. పరవాడ వెన్నెల పాలెం జంక్షన్ వద్ద దత్త సంతోషి సత్యదేవ త్రయంబకేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర నవగ్రహ దేవాలయంలో అభిషేకాలు జరిగాయి. పరవాడ, వెన్నెలపాలెం, కలపాక, గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, రావాడ, మెరిసివానిపాలెం, బద్ధపువానిపాలెం, తానాం, బోనంగి తదితర గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేశారు.

చోడవరం : శివరాత్రి సందర్భంగా మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక గౌరీశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుండి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో క్యూ లైన్‌లు ఏర్పాటు చేశారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. రాయపురాజుపేట, గవరవరం, ముద్దుట్టి, గౌరీపట్నం, గోవాడ, వెంకన్నపాలెం, లక్కవరం గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలను దర్శించారు. అనేక చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కశింకోట : మండలంలోని ఎఎస్.పేట గ్రామంలో సాంబశివ ఆలయంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు సర్పంచ్ మలసాల ధనమ్మ దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలాటం చేసిన రెండు బృందాల సభ్యులను అభినందించారు.

బుచ్చయ్యపేట : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, నీలకంఠాపురం, రాజాం, సీతయ్యపేట తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. నీలకంఠాపురం గ్రామంలో అన్న సమారాధన నిర్వహించారు.


మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లిలో దక్షిణేశ్వర స్వామి ఆలయం, వెంకటాపురంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయం, నాగులపల్లిలోని పర్వతవర్ధిని సహిత రామలింగేశ్వర స్వామి ఆలయం, మునగపాకలో సాంబమూర్తి, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర, భీమలింగేశ్వర స్వామి ఆలయాలు ఉదయం నుండి భక్తులతో కిటకిటలాడాయి. పలువురు భక్తులు శివునికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అచ్యుతాపురం : మహాశివరాత్రి సందర్భంగా పూడిమడక, వాడపాలెం సముద్రతీరాల్లో భక్తులు స్నానాలు చేసి జాగరణ కార్యక్రమం ప్రారంభించారు. తిమ్మరాజుపేట, పెదపాడు, జగ్గన్నపేట, హరిపాలెం, కొండకర్ల, ఎం జగన్నాథపురం, అచ్యుతాపురం, మోసయ్యపేట, దుప్పుతూరు, మార్టూరు, మడుతురు, దోసూరు తదితర గ్రామాలలో శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో అన్న సమరాధన నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా జాగరణకై పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చౌడపల్లిలో శివ భక్తులు ప్రత్యేకమైన వేషధారణ ధరించి గ్రామంలో ర్యాలీగా తిరిగారు.

నక్కపల్లి:మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. మండలంలోని ఉపమాక శివాలయంలో శనివారం తెల్లవారుజాము నుండి భక్తులు బారులు తీరారు. చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మహేష్, సంతోష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ చెరుకూరు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. గొడిచెర్లలో శేష లింగేశ్వర స్వామి, పాటిమీద శివాలయంలో భక్తులు బారులు తీరారు.

చీడికాడ:మండల కేంద్రంలో శివాలయంలో భక్తులకు దాతల సహకారంతో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.ఆలయం వద్ద ఎడ్లబండ్ల పందాలు నిర్వహించారు. డాన్స్ బేబీ డాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తకోట:మహాశివ రాత్రి తీరు నాళ్ళు సందర్భంగా రావికమతం మండలం కల్యాణపులోవ లో తొలి రోజు భక్త జనం పోటేత్తారు. తొలి రోజు సుమారు 70 వేలు మంది భక్తులు హాజరు అయినట్టు దేవాదాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రతి ఏటా స్థానిక కల్యాణపోతురాజు, పెద్దింటమ్మ తీరునాళ్ళు మూడు రోజుల పాటు నిర్వహిస్తుంటారు. కల్యాణపులోవ జలాశయంలో స్నానాలు ఆచరించి పోతు రాజుబాబు (శివాలయం)పెద్దింటమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, దేవాదాయ శాఖ, స్థానిక వైసీపీ నాయకుల ఆధ్వ ర్యంలో భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహ్మాద్, ఎస్ఐ విభూషణరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణకు సుమారు 300 మంది సిబ్బందితో గస్తీ నిర్వహించారు. స్నాన ఘట్టాల వద్ద ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లతో నిఘా ఏర్పాటు చేశారు. దేవాలయం వద్ద ఎంపిపి పైల రాజు, మండల తహసిల్దార్ మహేశ్వరరావు, ఆర్ఐ చిన్నబ్బాయి, డిసిఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ్, గ్రామ సర్పంచ్ గంగరాజు, ఎంపిటిసి గాలి రమణబాబు ఆతధ్వర్యంలో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.



విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

భక్తుడికి గాయాలు

ఇదిలా ఉండగా తొలి రోజు కళ్యాణపు లోవ జలాశ యం వద్ద పుణ్య స్నానం చేసేందుకు వచ్చిన భక్తుడు ప్రమాదవశాత్తు ఎడమ కాలు విరిగి తీవ్ర గాయమైంది.తక్షణమే స్పందించిన ఫైర్ సిబ్బంది స్థానిక వైద్య శిభిరానికి తరలించి ప్రథమ చికిత్స అందజేశారు. మైరుగైన చికిత్సకు కొత్తకోట ఆసుపత్రికి తరలించారు.



చోడవరంలో అన్నసమారాధన



నర్సీపట్నంలో...

ఉత్తర వాహినిలో సందడి

నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలో బలిఘట్టం లో పవిత్ర పుణ్యక్షేత్రమైన ఉత్తర వాహిని భక్తులతో కిటకిటలాడింది.పాకలపాడు గురుదేవుల ఆలయం లో ఘనంగా పూజలు చేశారు. ఈ ప్రాంతంలో దత్తాత్రేయ, వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.స్థానిక వాసవి క్లబ్ నిర్వాహకులు పాకలపాడు గురువు ఆశ్రమం వద్ద పులిహోర అందజేశారు.

స్థానిక పెద్ద చెరువు వద్ద కాశీ విశ్వేశ్వర, బలిఘట్టంలో బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు శివునికి రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అన్నపూర్ణ ట్రస్ట్, సత్యసాయి సేవ సమితి, నర్సీపట్నం ప్రైవేట్ కళాశాలలు అన్నదానాలు నిర్వహించారు. పాకలపాడు గురుదేవుల విగ్రహాన్ని రథంపై నర్సీపట్నం పురవీధిలో ఊరేగించారు. అయ్యన్న కాలనీలో దక్షిణామూర్తి శివాలయంలో స్వామివారిని అలంకరించారు.

వేడుకలలో ఉప ముఖ్యమంత్రి

మాడుగుల: మహాశివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. మండల కేంద్రంలోని సాగరం రహదారి వద్ద పోతురాజు బాబు పెద్ద మహెూత్సవంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పాల్గొన్నారు. మాడుగులలోని ఉబ్బలింగేశ్వరస్వామి, భీమ లింగేశ్వర స్వామి, స్వర్గ లింగేశ్వర ఉమా లింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు జంపెన శివాలయం, పురాతన పిట్టగడ్డ ఆలయాలలో భక్తులు బారులు తీరి పూజలు చేశారు.

కోటవురట్ల:మండలంలో కోటవురట్ల, జల్లూరు, పందూరు శివాలయాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.లింగాపురం, రాజుపేట, వెంకటాపురం, తంగేడు, గ్రామాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

రద్దీగా దారమఠం శైవక్షేత్రం

గొలుగొండ:మండలంలోని దారమఠంలో ఉమాదారమల్లేశ్వరస్వామి ఆలయంలో మొదటి రోజున శనివారం వేలాదిమంది భక్తులు తరలి వచ్చారు. మహిళలకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 3వేల మంది భక్తులకు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మూడు రోజులపాటు భారీ బందోబస్తుని సిద్ధం చేశారు. నర్సీపట్నం డిఎస్పి ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ రమణయ్యతో పాటు గొలుగొండ ఎస్సై నారాయణరావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. దారమఠం చేరేందుకు బస్సులను ఏర్పాటు చేశారు. మొదటి రోజు సుమారు 20వేల మంది భక్తులు వచ్చినట్లు అంచనా.ఏఎల్‌పురం నీలకంఠేశ్వరస్వామి ఆలయం, చీడిగుమ్మల శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నర్సీపట్నం రూరల్:
బలిఘట్టంలో బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. పెదబడ్డేపల్లి శివాలయంతో పాటు పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.ఆలయాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించండి




గాజువాక అజీమాబాద్‌లో ప్రచారం చేస్తున్న నేతలు

పలు చోట్ల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ గాజువాక జోన్, 66వ వార్డు అజీమాబాదులో శనివారం ప్రజాసంఘాల నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి, ముద్రించిన కరపత్రాలను అందించి, రమాప్రభకు ప్రథమ ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేత ఎస్.అనిత, ఐద్వా అధ్యక్షులు కామేశ్వరి, కార్యదర్శి జి.లక్ష్మి, సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, ఎం విజయరావు, ఎన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం:250 ప్రజా సంఘాలు బలపర్చిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎం.రామ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని హరిపాలెం గ్రామంలో ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి ఎం.వెంకట అప్పారావు, సెజ్ నిర్వాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బుద్ధ రంగారావు తదితరులతో కలిసి శనివారం పట్టభద్రులను కలిశారు. పట్టభధల ఓట్లను రమాప్రభకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజా సంఘాలు యువకులు విద్యావంతులు ప్రతి ఒక్కరు రమాప్రభ గెలుపునకు కృషి చేసి సహకరించాలని కోరారు.



హరిపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుందాం

-41వ వ్యవస్థాపక దినోత్సవంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ -నిర్వాసిత నిరుద్యోగుల నిరసన దీక్ష

ప్రజాశక్తి-ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితిల్లోనూ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని చేస్తున్న పోరాటానికి అందరి మద్దతు లభిస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ 41వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉక్కునగరం కొవ్వొత్తుల జంక్షన్ వద్ద ఉక్కు మృతువీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా కార్మికులంతా ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని ప్రతిజ్ఞ చేశారు. అఖిలపక్ష పోరాట కమిటీ వేసి కార్యాచరణ రూపొందించి వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వద్దకు వెళ్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిని చూపించి, ప్రభుత్వ రంగంలో కొనసాగేలా ఢిల్లీలోని అన్ని పార్టీలను కలిసి మద్దతు కోరనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, రామకృష్ణ, కె ఎస్ ఎన్,మస్తానప్ప పాల్గొన్నారు.

నిర్వాసిత నిరుద్యోగులు నిరసన దీక్ష

32 త్యాగధనుల సమాధులపై నిర్మించిన స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టడం దుర్మార్గమని నిర్వాసిత నిరుద్యోగులు అన్నారు.స్టీల్ ప్లాంట్ 41 వ వ్యవస్థాపక సందర్భంగా ఉక్కునగరం కొవ్వొత్తుల జంక్షన్ వద్ద నిరసన దీక్ష చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఎనిమిది వేల పైచిలుకు నిర్వాసితులకు న్యాయం చేయకుండా ఎలా ప్రైవేటీకరణ చేస్తారని ప్రశ్నించారు. ప్రాణ త్యాగాలు చేసైనా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని దీక్ష పూనారు. కార్యక్రమంలో ఉమ్మడి అప్పారావు, భాస్కరరావు, అధిక సంఖ్యలో నిర్వాసిత నిరుద్యోగులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు



స్టిక్కర్లు ఇస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

గృహ సారధులు కష్టించి పని చేయాలి

శాసనసభ్యులు బాబూరావు

ప్రజాశక్తి పాయకరావుపేట:గృహ సారధులు కష్టించి పని చేయాలని శాసనసభ్యులు గొల్ల బాబురావు పిలుపునిచ్చారు. స్థానిక రఘుపతి ఫంక్షన్ హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైయస్సార్ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం వచ్చే నెల 18వ తేదీ నుండి ప్రారంభం కానుందన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెయిన్ విస్తరణపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళతామన్నారు. ఒక సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లు ఉంటారని, 50 కుటుంబాలకు ఒక కన్వీనర్, ఇద్దరు గృహసారథులు ఉంటారని ఇద్దరిలో ఒకరు మహిళ ఉండాలన్నారు. గృహ సారథులు 15 రోజుల వ్యవధిలో అన్ని కుటుంబాలను కలుసుకోవాలని సూచించారు. గృహసారథులు ప్రజలతో మమేకమై ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను తెలియజేయాలని అన్నారు. పార్టీ సమావేశాలకు వీరు ఆహ్వానితులుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, మండల అధ్యక్షులు దనిశెట్టి బాబురావు, పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, ఉప సర్పంచ్ జగతా భవాని శ్రీను, సర్పంచ్ పడాల సోమన్న దొర, నాయకులు చోడిపల్లి శ్రీను, అశోక్ చక్రవర్తి పాల్గొన్నారు.



నాగభరణాన్ని ఇస్తున్న పద్మావతి

శివాలయానికి నాగాభరణం వితరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ :మున్సిపాలిటీ 28వ వార్డులో అయ్యన్న కాలనీ సూర్యబాబా ఆశ్రమంలో దక్షిణామూర్తి శివలింగానికి రూ.50వేల విలువైన వెండి నాగభరణాన్ని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్(ఎపిఇఎంజెఎ) రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్ కుమార్ అందజేశారు. ఈ నాగభరణాన్ని 26వ వార్డు కౌన్సిలర్ అయ్యన్న సతీమణి పద్మావతి చేతుల మీదుగా శనివారం స్వామివారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చందనాడ గ్రామంలో ఈనెల 19న ఆదివారం దుర్గాదేవి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని పూల అలంకరణతో ముస్తాబు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

డిటిగా నరేంద్ర బాధ్యతలు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పని చేస్తున్న నరేంద్ర రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రీ సర్వే పనులు త్వరితగతిన జరిగేలా కృషి చేస్తానన్నారు.

'కేపిటల్' కోసమేనా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ సాగర 'తీరం' సరికొత్త హంగులతో 'హారం'గా మారుతోంది. ఈ అభివృద్ధి వ్యూహం వెనుక 'ద్విముఖ' అజెండా ఉంది. సాధారణంగా ప్రస్తుత వ్యవస్థలో పాలకులు ఎవరైనా సరే సొంత ప్రయోజనాలు లేకుండా ఏ పనీ చేపట్టరు. ఉదాహరణకు మన దేశాన్ని వలస దేశంగా చేసుకుని పాలించిన బ్రిటిష్ ప్రభుత్వం రైల్వే లైన్లను వేయడం వెనుక వారి వ్యాపార ప్రయోజనాలు ప్రధానం కాగా, అవి మన దేశానికి ఉపయోగపడ్డాయి. ఉభయ తారక మంత్రంలాగ తాజాగా రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కూడా విశాఖను రాజధాని చేసుకుని పాలన చేసేందుకు ప్రకటనలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. మరో వైపు మార్చిలో అంతర్జాతీయ సదస్సులు పెట్టి పెట్టుబడులు (కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) తెస్తామంటూ చెబుతున్న విషయం తెలిసిందే. మొత్తానికి విశాఖ సాగర తీరం ఇప్పుడు సర్వాంగ సుందరంగా మారిపోబోతుంది. గడిచిన 10 రోజులుగా ఆర్‌కెబీచ్ నుంచి భీమిలి బీచ్ వరకూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం రోడ్లు, సాగర తీరం, కొండలు, గుట్టలు అన్నిటినీ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయడం నగర ప్రజలు కళ్లారా చూస్తున్నారు. సరికొత్త హంగులను సమకూర్చుతున్నారు. సుమారు రూ.150కోట్ల మేర ఈ రిపేర్లు, రంగులు, హంగుల కోసం గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ ద్వారా ఖర్చుచేయిస్తున్నారు.

ప్రచారం హల్‌చల్

రాజధాని వచ్చేస్తుంది కదా? అందుకోసమని కొందరు... అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్నాయి కాబట్టి ఆ మాత్రమైనా ప్రభుత్వం పట్టించుకుందంటూ ఇంకొందరి వాదనలు విశాఖలో హల్‌చల్ చేస్తున్నాయి. వచ్చే మార్చి నెలలో రెండు భారీ ఈవెంట్లు నగరంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చి 3, 4 తేదీల్లో ఏయూ ఇంజినీరింగ్‌కాలేజీ గ్రౌండ్స్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ సెట్టింగులు చేస్తోంది. దేశంలోని పలు ప్రధాన నగరాల నుంచి, విదేశాల నుంచి కూడా ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇదే నెల 28, 29 తేదీల్లో జి-20 దేశాల సదస్సు కూడా విశాఖలోనే జరుగనుంది. బీచ్‌రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో దీన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. విశాఖను జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ ఒక స్థాయిలో చూపేందుకు చేసే ప్రయత్నాలు మంచివే కావచ్చు. ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా విశాఖను మార్చేసే మరిన్ని సొబగులు అద్దేందుకు జరిగే కృషినీ తప్పుపట్టలేము.



ప్రభుత్వ నేతల తలోదారి?

అయితే.... ప్రభుత్వ ప్రతిపాదిత 3 రాజధానుల అంశం వివాదమై కోర్టులకెక్కినా ఆ మాటల నుంచి ప్రభుత్వ మంత్రులు వెనక్కి రావడం లేదు. బుగ్గన అమాత్యులేమో 3 కాదు ఒకటే రాజధాని అంటారు? మరో మంత్రి 3 అంటాడు.. స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను నెలరోజుల్లో విశాఖకు షిఫ్ట్ అవుతానంటూ ప్రకటన చేశారు. అమరావతి ఏకైక రాజధాని అంటూ ఒకసారి... రాష్ట్రప్రభుత్వ ఇష్టం అంటూ మరోసారి (కోర్టులో వివాదం నడుస్తున్నా) కేంద్రంలోని బిజెపి సర్కారు దొంగనాటకాలతో రక్తికట్టిస్తోంది. కేంద్రం చేష్టలు, రాష్ట్ర పెద్దల వ్యాఖ్యలు కోర్టు పరిధి దాటిపోయి స్వైరవిహారం చేస్తున్నాయి.

విశాఖ అంటే సాగర తీరమేనా?

బీచ్‌లు విశాఖలోనే లేవు. దేశంలో ఏదో రంగంలో బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలైన కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, గోవా వంటి చోట్లా ఉన్నాయి. ఒడిశా కూడా తక్కువేమీ కాదు. కానీ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఆసియా ఖండంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా పేరు రావడానికి ఇక్కడ గల స్టీల్‌ప్లాంట్, పోర్టు వంటి కీలక ప్రభుత్వ రంగ పరిశ్రమలని చెప్పవచ్చు. సరకు రవాణాలో వైజాగ్ పోర్టు, స్టీల్ ఉత్పత్తి, వ్యాపార లావాదేవీల్లో స్టీల్‌ప్లాంట్ భారీ సంస్థగా ఉన్నాయి. కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రయివేటీకరణ విధానంతో రెండేళ్లకు పైబడి కార్మికవర్గం పోరాటబాట పట్టింది. 100శాతం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసే దేశ ప్రధాన మంత్రి మోడీ కుట్రవ్యూహం విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై తీవ్ర దుష్ప్రభావం పడుతోంది. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్న సందర్భంలో వైజాగ్‌లో పారిశ్రామిక వేత్తల కోసం సదస్సులు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. గత చంద్రబాబు ప్రభుత్వ హయంలోనూ అంతర్జాతీయ సదస్సుల హంగామా జరిగిన సంగతి తెలిసిందే. ఎన్ని సిఐఐ సదస్సులు జరిగినా విశాఖకు గానీ, ఈ ప్రాంతంలోగానీ ఒక్క పరిశ్రమా రాలేదు. తాజాగా రూ.లక్ష కోట్ల మేర కేపిటల్ సహా పరిశ్రమలు కొత్తవి రానున్నాయని ప్రభుత్వ మంత్రులు చెబుతున్న విషయం తెలిసిందే. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటే రూ.3లక్షల కోట్ల విలువైన పెట్టుబడి విశాఖలో ఉన్నట్టే అన్న సంగతిని ప్రభుత్వం పెడచెవిని పెడుతుందని అనుకోవచ్చా?